కర్నూలు జనరల్ హాస్పిటల్‌లో కోవిడ్ పరీక్షలు చేస్తున్న వైద్యులు, పరిశీలిస్తున్న సూపరిన్‌టెన్‌డెంట్ వెంకటరంగారెడ్డి , తదితరులు

జగన్‌లాంటి ముఖ్యమంత్రిని ఎక్కడా చూడలేదు

- రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి
- అంగన్వాడీల సమ్మెకు రైతు సంఘం సంఘీభావం

ప్రజాశక్తి - గూడూరు

ఒకవైపు అంగన్వాడీలు పండగలు కూడా చేసుకోకుండా సమ్మెలో కూర్చుంటే.. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రం తన కుటుంబంతో ఆనందంగా పండగ చేసుకుంటున్నారని, ఇలాంటి ముఖ్యమంత్రిని ఎక్కడా చూడలేదని రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం గూడూరులో సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 16 రోజుకు చేరుకుంది. ఈ సమ్మె శిబిరంలో అంగన్వాడీలు నలుపు దుస్తులు ధరించి నిరసన చేపట్టారు. ఈ సమ్మెకు రైతుసంఘం సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 1.20 లక్షల మంది అంగన్వాడీలు 16 రోజులుగా రోడ్లపైకి ఎక్కి సమ్మె చేస్తుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కనపడడం లేదని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అందరి కంటే మెరుగైన వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలో తొక్కారని, అంగన్వాడీల పోరాటాన్ని విచ్ఛినం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాలుగా కుట్రలు, కుతంత్రాలు చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం అంగన్వాడీలను చర్చలకు పిలవడమే తప్ప చర్చల్లో ఎలాంటి హామీ ఇవ్వకుండా అంగన్వాడీల సహనాన్ని పరీక్షిస్తున్నారని తెలిపారు. ఐదేళ్ళు పాలించే ఎమ్మెల్యేలకు, ఎంపీలకు రూ.లక్షల జీతాలు ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న అంగన్వాడీలకు జీతాలు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వానికి చేతులు రావడం లేదని మండిపడ్డారు. అంగన్వాడీలకు జీతాలు పెంచమంటే ఖాళీ ఖజానా చూపిస్తున్నారని, జగన్మోహన్ రెడ్డి ఫామ్ హౌస్ కట్టడానికి రూ.400 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రి ఉషశ్రీ చరణ్ అంగన్వాడీలకు ఇచ్చే ఫోన్లకు రూ.కోట్లు ఖర్చు పెట్టామని చెబుతున్నారని, అంగన్వాడీలకు ఇచ్చే ఫోనులో కూడా కుంభకోణం జరిగిందని తెలిపారు. కేవలం కుంభకోణాలు చేసి రూ.కోట్లు సంపాదించుకోవడానికి ఈ మంత్రులు ఉన్నారని, అంగన్వాడీల సమస్యలు పట్టడం లేదని విమర్శించారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే వరకు రైతు సంఘం అన్ని విధాలుగా తోడు ఉంటుందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఎంపీలు, ఎమ్మెల్యేలను వీధుల్లో తిరగనియ్యబోమని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర'తో రూ.కోట్లు కొల్లగొట్టడానికి ప్రయత్నిస్తోందని తెలిపారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వంతో 'ఆడుదాం వైసిపి ప్రభుత్వం'తో అనే కార్యక్రమం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలను మళ్లీ చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలను కలుపుకొని కలిసి వచ్చే ఇతర ప్రజా సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్, రైతు సంఘం జిల్లా నాయకులు హనుమంతు, ఆంజనేయులు, మల్లయ్య, కృష్ణ, సూరి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అరుణ, ఇందుమతి, రత్నమ్మ, కళావతి, మంజుల, రాజేశ్వరి, మహేశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

గూడూరులో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

అంగన్వాడీల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటి ముట్టడి

కర్నూలు క్రైమ్ : సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేపట్టిన పోరాటంలో భాగంగా కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హఫీజ్ ఖాన్ ఇంటిని ముట్టడించారు. బుధవారం మధ్యాహ్నం వారు ఎమ్మెల్యే ఇంటి వద్దకు భారీ ఎత్తున తరలివచ్చి ఇంటి ముందు బైఠాయించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నినదించారు. దాదాపు గంటపాటు ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా శ్రామిక మహిళ సంఘం ప్రధాన కార్యదర్శి పి.నిర్మల మాట్లాడారు. అంగన్వాడీలు 16 రోజులుగా పోరాటం చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అంగన్వాడీలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నారని తెలిపారు. గ్రాట్యుటీని అమలు చేయాలని కోరారు. సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, పింఛను సగం జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చలను విఫలం చేసి 15 రోజుల తర్వాత నిర్ణయం చెబుతామని ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమన్నారు. వెంటనే ప్రభుత్వ నిర్ణయాన్ని తెలియజేయాలని కోరారు. ప్రభుత్వాలనే కూల్చేసిన చరిత్ర అంగన్వాడీలకు ఉందని, సమస్యలు పరిష్కరించకపోతే ఎందాకైనా పోరాడేందుకు అంగన్వాడీల సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఎఐటియుసి జిల్లా నాయకులు మునెప్ప మాట్లాడుతూ... ఎమ్మెల్యే సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని విమర్శించారు. అనంతరం ఎమ్మెల్యే బయటకు వచ్చి సమాధానం ఇవ్వాలని నినదించడంతో ఎమ్మెల్యే బయటకొచ్చి అంగన్వాడీల నుంచి వినతిపత్రం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఇదివరకే అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, ప్రభుత్వం తగిన సమయంలో అంగన్వాడీలకు అనుకూలంగా తగిన నిర్ణయాన్ని తీసుకుంటుందని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని సహకరించాలని కోరారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.రేణుక, ఎఐటియుసి నాయకులు మునెప్ప, సిఐటియు జిల్లా నాయకులు వేణుగోపాల్, కె.సుధాకరప్ప, ఎఐటియుసి నాయకులు చంద్రశేఖర్, కెవిపిఎస్ నాయకులు ఆనంద్‌బాబు, చిన్న వ్యాపారుల సంఘం జిల్లా నాయకులు మహ్మద్ రఫీ, రామకృష్ణ, కృష్ణ, విజయమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బెదిరింపులకు లొంగం

కర్నూలు అగ్రికల్చర్ : బెదిరింపులకు లొంగబోమని, డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్వాడీలు హెచ్చరించారు. బుధవారం ధర్నా చౌక్‌లో అంగన్వాడీల సమ్మె 16వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు నిర్మల, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడారు. వైసిపి మంత్రులు అంగన్వాడీల ఉద్యమాన్ని పక్కదారి పట్టించాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సమ్మె శిబిరానికి డప్పు కళాకారుల సంఘం నాయకులు డప్పులతో దరువులు మోగించి అంగన్వాడీలను ఉత్సాహపరిచారు. డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి.ఆనంద్ బాబు మాట్లాడుతూ... కెవిపిఎస్ అనుబంధ సంఘాలన్నీ ఈ పోరాటంలో భాగస్వామ్యం అవుతాయని మద్దతు తెలిపారు.

అంగన్వాడీల సమస్యలపై ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

అంగన్వాడీల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ప్రచురించింది. ఈ సంచికను రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీల సమ్మె శిబిరాల్లో అంగన్వాడీలతో కలిసి ఆవిష్కరించారు. కర్నూలు నగరంలోని ధర్నా చౌక్‌లో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ, ఎల్ఐసి నాయకులు సునియకుమార్, పోస్టల్ నాయకులు శమంతకమణి రెడ్డి, బిఎస్ఎన్ఎల్ గౌరవాధ్యక్షులు భాస్కర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ మాట్లాడారు. వివిధ ప్రాంతాల్లో అంగన్వాడీలు నిర్వహిస్తున్న ఉద్యమాల ప్రాధాన్యతను, వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకు ప్రజాశక్తి చేస్తున్న కృషిని వివరించారు. ఉద్యమాల ప్రభావాన్ని ప్రజలకు తెలియజేసేందుకు నిర్వహిస్తున్న పాత్రను తెలిపారు. అంగన్వాడీలు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం వెంటనే విరమింపజేసి న్యాయమైన కోర్కెలు తీర్చాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ నాయకులు బి.రేణుక, పుష్ప, అంగన్వాడీ యూనియన్ (ఎఐటియుసి) నాయకులు నాయకత్వం వహించారు.

ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న నాయకులు

జిజిహెచ్‌లో జెఎన్ 1 కోవిడ్ పరీక్షా కేంద్రాల ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జెఎన్1 కోవిడ్ పరీక్ష కేంద్రాలను ఆసుపత్రి సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ వి వెంకట రంగారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎఫ్ఎంసి కోవిడ్ జెఎన్ 1 విభాగం, పీడియాట్రిక్, మెడికల్ విభాగం ఓపి9లలో కోవిడ్ పరీక్షా కేంద్రాలను ప్రారంభించామన్నారు. దేశంలో వివిధ రాష్ట్రాల్లో కోవిడ్ కేసుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో జిజిహెచ్‌లో మూడు దఫాలుగా కోవిడ్ సేవలందించామని తెలిపారు. ఆసుపత్రిలోని ఎఫ్ఎంసి–కోవిడ్ జెఎన్ 1 విభాగంలో 45 పడకల విభాగాన్ని సిద్ధం చేసి అందుబాటులోకి తెచ్చామన్నారు. అందులో వెంటిలేటర్స్ , ఆక్సిజన్ ఫోర్స్ సిద్ధం చేశామని తెలిపారు. ఆసుపత్రిలో మూడు చోట్ల కోవిడ్ జెఎన్ 1 టెస్టులను పీడియాట్రిక్, మెడికల్ విభాగం ఓపీ9 ఎఫ్ఎంసి కోవిడ్ జెఎన్ 1 విభాగాలలో ఆర్‌టిపిసిఆర్ టెస్టులను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. అందులో ఈరోజు 100 రోగులకు ఆర్‌టిపిసిఆర్ టెస్టులను చేసినట్లు తెలిపారు. కోవిడ్ జెఎన్ 1 కేసెస్ కొరకు పరీక్షలు ఆర్‌టిపిసిఆర్ టెస్టులు చేయించడం, పేషెంట్స్ ఎవరికైనా పాజిటివ్ వస్తే వారికి హోమ్ ఐసోలేషన్ , వార్డులో కేసులు అడ్మిట్ చేయడానికి బెడ్స్ సిద్ధం చేశామని తెలిపారు. కోవిడ్ కేసుల నుంచి ఎటువంటి భయాందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ఎవరికైనా సింప్తమాటక్ చేంజెస్ ఉంటే వాళ్లకు హోమ్ ఐసోలేషన్, మిగతా ఎవరికైనా క్రిటికల్‌గా ఉన్నవాళ్లకి అడ్మిషన్ చేసి వాళ్ళని ట్రీట్మెంట్ అందిస్తామని తెలిపారు. ఆసుపత్రి సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, కోవిడ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, హెచ్ఒడీస్ డాక్టర్ విజయానందబాబు, డాక్టర్ దామాం శ్రీనివాసులు, డాక్టర్ వీర కుమార్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నగాంజన్, డాక్టర్ సునీల్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా అక్రమ వెంచర్లు

- చూసీ చూడనట్లు అధికారులు
- నామమాత్రపు తనిఖీలతో మమ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

అధికార పార్టీ నేతల అండదండలతో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నిబంధనలు గాలికి వదిలేసినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన కుడా (కర్నూలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ) అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నామమాత్రపు తనిఖీలతో మమ అనిపించేస్తున్నారు...

కుడాను 2017లో ఏర్పాటు చేశారు. దీని పరిది , 15,306 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. కుడా పరిధిలో వెంచర్లు వేయాలంటే తప్పనిసరిగా నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. దీనిని ఎవరూ పాటించడం లేదు. కర్నూలు శివారు ప్రాంతంలో గతంలో అధికారులు తనిఖీ చేసి వంద వరకు అక్రమ వెంచర్లు ఉన్నట్లు గుర్తించారు. నంద్యాల పరిధిలో 88, ఎమ్మిగనూరు 70, ఆదోని 10, బేతంచర్ల 21, నందికొట్కూరు 12, ఆళ్లగడ్డ 25, గూడూరు పట్టణ పరిధిలో ఎనిమిది వరకు అనుమతి లేని వెంచర్లు ఉన్నట్లు తేల్చారు. వీటి విస్తీర్ణం పది వేల ఎకరాలకు పైగా ఉన్నట్లు అంచనా. ఆయా వెంచర్లలో 20 అడుగులకు మించి రహదారులు ఉండటం లేదు బహిరంగ స్థలాలు వదలడం లేదు. వెంచర్లకు అనుమతి పొందిన తర్వాత అందులో కొన్ని ప్లాట్లను కుడాకు తనకా(మార్టిగేజ్) పెట్టాలి. నిర్వాహకులు వెంచర్‌లో వసతులు కల్పించకపోతే తనఖా పెట్టిన స్థలాలు విక్రయించి అధికారులే అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. అసలు భూమే తనఖా పెట్టడం లేదని తెలుస్తోంది. ఒక ఎకరాకు కుడా అనుమతి పొందాలంటే దాదాపు రూ. 70 వేల వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అనుమతులకే భారీగా డబ్బులు చెల్లించాల్సి ఉండటంతో అనధికారికంగా వెంచర్లు వేస్తున్నారు. రెవెన్యూ శాఖ నుంచి ల్యాండ్ కన్వర్షన్ చేయించుకుని డాక్యుమెంటు విలువపై 10 శాతం దునుము చెల్లించాలి. ఈసీ, టైటిల్ డీప్ పొందుపరిచి మాస్టర్ ప్లాన్ ప్రకారం నివాస యోగ్యమైన ప్రాంత స్థలాల పరిధికి లోబడి ఉంటేనే అనుమతులిస్తారు. ఎకరా స్థలంలో 40 అడుగుల రహదారులు, 10 శాతం బహిరంగ స్థలం, 0.1 శాతం యుటిలిటీ, రెండు శాతం ఎమినిటీస్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన లేఅవుట్లో అన్ని అనుమతులు పొందాలంటే ఎకరా స్థలంలో 48 శాతం వరకు నిబంధనలకు అనుగుణంగా పోగా మిగిలిన 52 శాతం స్థలంలోనే ప్లాట్లు వేయాలి. వెంచర్లు వేసే వారితో అధికార పార్టీ నేతలు చేతులు కలిపి ఉమ్మడి వ్యాపారాలు చేయడమో వెనుక ఉండి నడిపించడమో చేస్తున్నారు. వచ్చే లాభాల్లో కొంతమేర ముట్టచెబుతుండటం, వెంచర్లలో వాటా కింద భూమి ఇవ్వడం వంటి ఒప్పందాలు చేసుకుంటున్నారు.

8వరోజు ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి కర్నూలు అగ్రికల్చర్

ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరవధిక సమ్మె బుధవారం ఎనిమిదో రోజు కొనసాగింది. డప్పుకళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి.ఆనందబాబు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఎస్ఎస్ఎ ఉద్యోగులు న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి పోరాడుతున్నారని, ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని ఉద్యోగుల నాయకులతో చర్చలు జరిపి న్యాయం చేయాలన్నారు. లేదంటే సామాజిక సంఘాలతో ఐక్యంగా నిలబడి పోరాడుతామని ఆనందబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఐలు జిల్లా నాయకులు రవికుమార్, మురళీమోహన్ , ఎస్–ఎస్ఎ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు జె నాగేశ్వరరావు, సంఘం జిల్లా అధ్యక్షులు రాజు మాట్లాడారు. నిరవధిక సమ్మెలో శ్వేత, సోమేశ్వరి, మల్లేశ్వరి, ఉరుకుందు కూర్చున్నారు. అసిస్టెంట్ ఇంజనీర్ రవికుమార్, ఎస్ఎస్ఎ ఉద్యోగుల జిల్లా కోశాధికారి జగదీష్ సంఘీభావం తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే కాటసాని జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కాటసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్లు

పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు బుధవారం వైఎస్‌పి నాయకులు కార్యకర్తలు అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని నివాసంలో నియోజకవర్గ పరిధిలో పలు చోట్ల పుట్టినరోజు వేడుకలు భారీ ఎత్తున నిర్వహించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడానికి ఎమ్మెల్యే నివాసానికి భారీ సంఖ్యలో హాజరైన నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు. అభిమానుల కోలాహలం మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ముందుగా వేద పండితులు వేద మంత్రాలు చదివి ఎమ్మెల్యే దంపతులను ఆశీర్వదించారు. అభిమానులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున ఎమ్మెల్యేను వారి నివాసంలో కలిసి పూలమాలలు, గజమాలలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కల్లూరు రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి సతీసమేతంగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

128 మంది రక్తదానం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

బిజెపి రాష్ట్ర నాయకులు కగ్గోలు హరీష్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ధర్నా చౌక్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మిత్రులు, అభిమానులు,కలిసి దాదాపు 128 మంది దాకా రక్తదానం చేశారని కగ్గోలు హరీష్ బాబు తెలిపారు. ప్రతిఏటా జన్మదిన రోజు రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిమానులు ప్రవీణ్ యాదవ్, వెంకటేష్, పవన్, సునీల్ పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే విడుదల చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్

ఉద్యోగ,ఉపాధ్యాయులకు రావల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు ధర్నా చౌక్‌లో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ధర్నా నుద్దేశించి రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి మాట్లాడారు. అధికారంలోకి వస్తే ప్రతీ నెలా 1వ తేదీన జీతాలు, మెరుగైన పిఆర్‌సి, సకాలంలో డిఎలు, ఉద్యోగ, ఉపాధ్యాయులతో స్నేహపూరిత వాతావరణం ఉంటుందని' 2019 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారన్నారు. దానికి భిన్నంగా మెరుగైన పిఆర్‌సి సకాలంలో డిఎలు ఇవ్వకపోగా 1వ తేదీన జీతం కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రతి నెలా 17 వరకు జీతాల కోసం, పెన్షన్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని అన్నారు. ఆగష్టు 24న జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సెప్టెంబర్ 2023 నాటికి అన్ని బకాయిలు చెల్లిస్తామని మంత్రివర్గ ఉపసంఘం, ఆర్థిక శాఖ అధికారులు ఇచ్చిన హామీ ఈనాటికి నెరవేరలేదన్నారు. ఫలితంగా రూ.18వేలకోట్లకుపైగా ఆర్థిక బకాయిలు ఉద్యోగులకు చెల్లించాల్సి వస్తున్నదన్నారు. ఒక పక్క సాక్షాత్తు ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఆర్థిక పరిస్థితి మెరుగైందని చెబుతుండగా, ఆర్థిక శాఖ అధికారులు మాత్రం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదనిచెబుతున్నారన్నారు. ఇద్దరిలో ఎవరి మాటలు విశ్వసించాలో తెలియదన్నారు. ఈనాటికి ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలు 2022 జనవరి నాటికి పిఆర్‌సి, డిఎ అరియర్లు, కొత్త డిఎ అరియర్లు, పిఎఫ్ లోన్లు, పార్టె ఫైనల్ పేమెంట్లు ఎపిజిఎస్ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్లు సరండర్ లీవులు తదితర బకాయిలు మొత్తం రూ.18 వేల కోట్లు చెల్లింపునకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ యుటిఎఫ్ పోరుబాట పట్టిందన్నారు. కావున, ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలు విడుదల చేయాలని, ప్రతి నెలా ఉద్యోగులకు మొదటి తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు హేమంత్ కుమార్, ఆర్థికర్యదర్శి యహోషువ , జయరాజు, దుర్గాప్రసాద్, ఇబ్రహీం, చంద్రకళ, విజయలక్ష్మి,అనిల్, రఫీక్, మోహన్ తిమన్న, మార్క్, నాగరాజు, బాలరాజు, రాములు, వెంకటేష్ సర్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని సాయంత్రం జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న గాంధీవిగ్రహ ం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలి : సిఐటియు

12వ రోజు, క్లాప్ డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

క్లాప్ డ్రైవర్ల నిరసన దీక్షను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎండి.అంజిబాబు

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేసే క్లాప్ డ్రైవర్ల పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ 12 రోజులుగా క్లాప్ ఆటోలు ఆపి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) నగర కమిటీ ఆధ్వర్యంలో క్లాప్ డ్రైవర్స్ యూనియన్ కార్యదర్శి రఘుశేఖర్ అధ్యక్షతన కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు బుధవారం దీక్ష చేపట్టారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ దేశాయి, విజయ రామాంజనేయులు పాల్గొన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి మాటతప్పి మడమతిప్పి రెడ్డి ఏజెన్సీ లాంటి బినామీ ఏజెన్సీలను ఏర్పాటు చేసి కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా అగ్రిమెంట్ ఉన్నా అమలు చేయకుండా పని భద్రత కల్పించకుండా కార్మికులను మోసం చేస్తున్నారని విమర్శించారు. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో పనిచేసే క్లాప్ డ్రైవర్లకు 6 నెలల నుండి 12 నెలల జీతాలు రాకపోతే ఏ విధంగా కుటుంబాలను పోషించు కుంటారని ప్రశ్నించారు. డిసిఎల్ జోక్యంతో అక్టోబర్ నుండి జీతాలు ఇస్తామని ఒప్పుకుని పని చేయించు కుంటున్న కమిషనర్ జీతాలు ఇవ్వకపోగా మాకు సంబంధం లేదని నిర్లక్ష్య సమాధానం చెప్పడంతోనే కార్మికులు మరోసారి సమ్మెకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. కార్మికులకు పీఎఫ్ ,ఈఎస్ఐ అమలు చేయకుండా, జీతాలు ఇచ్చిన ఫైల్స్ సబ్మిట్ చేసిన తర్వాతనే బిల్లు మంజూరు చేయాల్సిన కమిషనర్ ఒక ఐఎఎస్ అధికారిగా ఉండి ఏజెన్సీ మామూల్లకు లొంగిపోయి ఇష్టానుసారంగా బిల్లులు చేశారని విమర్శించారు. ఇప్పటికైనా వైసిపి ప్రభుత్వం మున్సిపల్ అధికారులు ఏజెన్సీ పైన ఒత్తిడి తెచ్చి క్లాప్ డ్రైవర్ల పెండింగ్ జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే కార్మికులను పెద్ద ఎత్తున సమీకరించి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మహేష్, రాజేష్, షఫీ, దసరత్, రామచంద్ర, మద్దిలేటి, అహమ్మద్,రవి ,పరమేష్ మరియు క్లాప్ డ్రైవర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపిన టిడిపి నాయకులు ం

రెండోరోజు మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి-గూడూరు

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గూడూరు నగర్ పంచాయతీ కార్యాలయం ఎదుట రెండోరోజు బుధవారం నిరవధిక సమ్మె చేశారు. ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి. సుప్రీంకోర్టు ఆదేశానుసారం సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి.. ఆధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో ఔట్ సోర్సింగు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలి...సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళన కొనసాగిస్తామని.... మున్సిపల్ ఎంప్లాయిస్ కార్మికులు, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెద్దపెట్టున నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా నాయకులు జె. మోహన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమ్మెకు కర్నూల్ పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ , మాజీ కెడిసిసి డైరెక్టర్ రాజారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు సంపూర్ణ మద్దతు తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమస్య పరిష్కారం అయ్యేంత వరకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. సిఐటియు కోడుమూరు డివిజన్ నాయకులు గఫూర్‌మియ్యా, టిడిపి సీని యర్ నాయకులు అయ్యావారునాయుడు, రైతు సంఘం కార్యదర్శి రేవుల గోవిందు, తెలుగు యువత ఉపాధ్యక్షులు వై నాగరాజు , సీనియర్ నాయ కులు టి నాగరాజు, విబి కిషోర్ వర్మ వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు సం ఘాల మధు, మూలగేరి లక్ష్మన్న, టిఎన్‌టియుసి పార్లమెంట్ కార్యదర్శి వడ్డె నాగేష్, చెట్టు కింద నారాయణ, పొన్నగంటి గజేంద్ర కోట్ల టీం సభ్యులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

హైకోర్టు పరిధిలోని అక్రమ నిర్మాణాలపై యంత్రాంగం ఆరా

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలోని గొల్లలదొడ్డిలో తహసీల్దార్ శేషఫణి ,ఇఒఆర్‌డి సందీప్ ల సమక్షంలో డిఎల్‌పిఒ నాగరాజు నాయుడు లు బుధవారం హైకోర్టు పరిధిలో ఉన్న అక్రమాలపై ఆరా తీశారు. అలాగే సర్వే నంబర్ 137/2 లో ప్రభుత్వ భూమి ఉందని ఏళ్లుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని కలెక్టర్ ఆదేశానుసారం పరిశీలించారు. అక్రమాలు ఆపకపోతే చర్యలు తప్పవన్నారు. ఆ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటుకు గ్రామస్థులతో సమీక్షించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా అదే జోరు.. 'గడప గడపకు' అపూర్వ ఆదరణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

'గడపగడపకు'లో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా బుధవారం ఊరూరా అదే జోరు కొనసాగించారు. మండలంలోని పెద్దతుంబలం గ్రామంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పాల్గొని మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని కోరారు. గ్రామంలోని బీసీ, మైనార్టీ కాలనీలో ఉపాధి హామీ చట్టం కింద రూ.70 లక్షలతో సిసి రోడ్డు వేసినట్లు తెలిపారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ రూ.35 లక్షల పంచాయతీ నిధుల ద్వారా సిసి రోడ్డు, రూ.15 లక్షలతో తాగునీరు పైపులైన్ వేయించినట్లు చెప్పారు. సర్పంచి ఉచ్చప్ప, బసవరాజ్, ఎంపిటిసి లక్ష్మీ శివరాజ్, ఉప సర్పంచి తిక్కయ్య, చంద్రశేఖర్, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, గురునాథ్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు హనుమంతు రెడ్డి, నర్సప్ప, స్వరూపరాజు, వన్నూర్ వలీ, చిన్న ఈరన్న పాల్గొన్నారు.

కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న ఈరన్న

మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ కార్మికుల సర్వీసు ఆధారంగా రెగ్యులరైజ్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, పట్టణ అధ్యక్షులు తిప్పన్న డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా ఆదోని మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు నవరత్నాలు వర్తింపజేయాలని కోరారు. కార్మికులు మరణిస్తే కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు యూనిఫారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాత పద్ధతిలోనే మున్సిపల్ కార్యాలయం దగ్గర మాస్టర్ విధానాన్ని అమలు చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులు, కార్మికులకు 101 పద్ధతి కింద వేతనాలు ఇవ్వాలని కోరారు. పెండింగ్ ఉన్న వేతనాలను విడుదల చేయాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు హెల్త్ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, చివరి జీవితంలో సగం పింఛనుగా ఇవ్వాలని, పర్మినెంట్ సిబ్బందికి సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు.

పార్టీ పూర్వవైభవానికి కృషి

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

రామకృష్ణతో మాట్లాడుతున్న గుడిసె ఆది కృష్ణమ్మ

ఆదోని నియోజకవర్గంలో టిడిపి జెండాను ఎగురవేసి, పార్టీ పూర్వ వైభవానికి కృషి చేద్దామని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. బుధవారం టిడిపి సీనియర్ నాయకులు ఆరేకల్ రామకృష్ణతో రాజకీయ పరిస్థితులపై చర్చ జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయానికి తన వంతు సహకారం కావాలని కోరారు. టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, మాజీ ఎంపిపి మురళీకృష్ణ, వడ్డేమాన్ గోపాల్, రాఘవేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

వలసలను అరికట్టాలి

- ఉపాధి పెండింగ్ బకాయిలు చెల్లించాలి
- జనవరి 3న ఎంపిడిఒ కార్యాలయాల ముట్టడి
- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

జిల్లాలో గత పది వారాలుగా పని చేస్తున్న ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వలసలను అరికట్టాలని వ్యకాస జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వీరశేఖర్, కెవి.నారాయణ కోరారు. అధికారులు, ప్రభుత్వం వైఫల్యాన్ని నిరసిస్తూ జనవరి 3న జిల్లాలోని అన్ని ఎంపిడిఒ కార్యాలయాల ముందు నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలోని ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల నుంచి వలసలు తీవ్రంగా ఉంటున్నాయని తెలిపారు. వలసలను అరికట్టడంలో ప్రభుత్వం, అధికారులు విఫలం చెందారని విమర్శించారు. వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి తిమ్మన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటి ముందు

అంగన్వాడీల బైఠాయింపు

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని అంగన్వాడీలు ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి ఇంటిని ముట్టడించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బుధవారం ఆదోనిలోని అంబేద్కర్ విగ్రహం నుంచి ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ, ప్రాజెక్టు యూనియన్ నాయకులు పద్మ, సరోజ, జానకి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటి వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ నిరసన తెలిపి వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మనోజర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, వీరారెడ్డి, కృష్ణమూర్తి, ఎఐటియుసి పట్టణ నాయకులు టి.వీరేష్, విజయ్ మాట్లాడారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. పింఛను సౌకర్యం చివరి జీతంలో 50 శాతం ఇవ్వాలని, రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. సూపర్‌వైజర్ ప్రమోషన్‌కు 50 సంవత్సరాలు పెంచాలని, సర్వీసులో చనిపోయిన అంగన్వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, వేతనంతో కూడిన లీవ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా నాయకులు పెద్దబాబు, కెవిపిఎస్ మండల కార్యదర్శి తిక్కప్ప మద్దతు తెలిపారు. అంగన్వాడీలు పద్మ, రేణుక, సరోజ, సోమక్క, గీత, వీరమ్మ, మీనా కుమారి, రిజ్వాన, శారద, ఈరమ్మ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరులో** అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 16వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఇంటిని ముట్టడించారు. అంతకుముందు తహశీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ ఇంటికి చేరుకున్నారు. ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి స్థానికంగా లేకపోవడంతో ఎమ్మెల్యే అల్లుడు, మండల మాజీ ఉపాధ్యక్షులు బసిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరశేఖర్, నారాయణ, మండల కార్యదర్శి తిమ్మన్న, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, ఎఐటియుసి తాలూకా నాయకులు వి.తిమ్మగురుడు, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి గోవర్ధనమ్మ, అర్బన్ కార్యదర్శి ఎస్.నాగలక్ష్మి, శైలజ, నాగ శిరోమణి, కృష్ణవేణి మాట్లాడారు. అంగన్వాడీల సమ్మె పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడి, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. శైలజ, తులసి, మేరీ, పద్మలత, గ్రేసమ్మ, నాగలక్ష్మి, నిర్మల, గౌసియా భాను, సునీత, బండ లత, సుమిత్ర, అత్తరు భాను, జయమ్మ, పార్వతి, సునీత, శంషాద్ భాను, రాగమ్మ పాల్గొన్నారు. **కోసిగిలో** 'ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మావయ్య మా టీచర్లకు వేతనాలు పెంచి, మాకు బువ్వ పెట్టాల'ని కోరుతూ అంగన్వాడీ పిల్లలు, వారి తల్లిదండ్రులు అంగన్వాడీ దీక్ష శిబిరం వద్దకు వెళ్లి మద్దతు తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, రైతుసంఘం మండల కార్యదర్శి వీరేష్, అంగన్వాడీ యూనియన్ (సిఐటియు) మండల నాయకులు లూసమ్మ, శైలజ, పద్మ మాట్లాడారు. అంగన్వాడీ యూనియన్ మండల నాయకులు జి.పద్మావతి, భాగ్యవతి, లలితమ్మ, సరోజ, భీమలింగమ్మ, అంజనమ్మ, ఈరమ్మ, సువర్ణ, దేవి, యు.లక్ష్మి, నాగవేణి, నాగరత్న, రాణి పాల్గొన్నారు. **ఆలూరులో** సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు కళ్లు, చెవులు, నోరు మూసుకొని నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణస్వామి, అంగన్వాడీ యూనియన్ నాయకులు జయశ్రీ, బాలరంగమ్మ, ప్రభావతి, భారతి మాట్లాడారు. అంగన్వాడీలకు ఎపిఎస్ఎస్ఎఈఎఫ్ జెఎసి ఉద్యోగులు మద్దతు తెలిపారు. సిపిఎం నాయకులు కృష్ణ, మైనా, గోవర్ధన్ పాల్గొన్నారు. **ఆస్పరి** తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో అంగన్వాడీలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల గౌరవాధ్యక్షులు బాలకృష్ణ, ఎఐటియుసి మండల కార్యదర్శి కృష్ణమూర్తి, అంగన్వాడీ యూనియన్ నాయకులు జ్యోతి, సరోజమ్మ మాట్లాడారు. అంగన్వాడీలు విధులకు హాజరయ్యే వరకు సెంటర్లకు రేషన్ బియ్యం, సరుకులు పంపించవద్దని కోరారు. అనంతరం తహశీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం మండల కార్యదర్శి రంగస్వామి, రవి, మురళీ, రామాంజనేయులు పాల్గొన్నారు. **మంత్రాలయంలో** సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 16వ రోజుకు చేరింది. కళ్లు, చెవులు, నోరు మూసుకుని నిరసన చేపట్టారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు ప్రమీల, లావణ్య, భీమేశ్వరి మాట్లాడారు. దాక్షాయని, శ్వేత, హనుమంతమ్మ, శ్యామల, ఫాతిమా, రజియమ్మ, కల్యాణి, జానకి, ఆయాలు మరియమ్మ, సుందరమ్మ, పద్మావతి పాల్గొన్నారు. **పెద్దకడబూరులో** అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెకు డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మద్దతు తెలిపారు. మహిళలతో పెట్టుకున్న ఏ ప్రభుత్వమూ నిలబడలేదని, వైసిపి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. అంతకుముందు అంగన్వాడీలు మంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు గౌరవాధ్యక్షులు తిక్కన్న, అంగన్వాడీ యూనియన్ నాయకులు జయమ్మ, చిట్టెమ్మ, అయ్యమ్మ, శారద పాల్గొన్నారు.

ఆదోని ఎమ్మెల్యే ఇంటి ముందు బైఠాయించిన అంగన్వాడీలు

ఎమ్మిగనూరులో మద్దతు తెలుపుతున్న వ్యకాస నాయకులు

ఆలూరులో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

కోసిగిలో మద్దతు తెలుపుతున్న పిల్లలు, వారి తల్లిదండ్రులు

మోటార్ల మరమ్మతుల పేరుతో

రైతుల నుంచి వసూళ్ల దందా

- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మిరప పంటను పరిశీలిస్తున్న తిక్కారెడ్డి

బసలదొడ్డి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసేందుకు మోటార్ల మరమ్మతుల పేరుతో రైతుల నుంచి ఎకరాకు రూ.3 వేల చొప్పున వైసిపి నాయకులు వసూళ్లకు పాల్పడ్డారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన కురువ నాగన్న, రాముడు సాగు చేసిన మిరప, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు సాగునీరందిస్తామని సుమారు రూ.5 లక్షలు వసూలు చేసి మోటార్లకు మరమ్మతులు చేయించకుండా చేతులు ఎత్తేశారని తెలిపారు. దీని కారణంగా రూ.4500 పెట్టి నీటి ట్యాంకర్ల ద్వారా పంట పొలాలను తడుపుతున్న దుస్థితి నెలకొందని ఆవేదన చెందారు. గత టిడిపి హయాంలో నీరు పుష్కలంగా ఇవ్వడంతో రెండు పంటలు వేసుకున్న రైతులు నేడు లబోదిబోమంటున్నారని తెలిపారు. వర్షాల్లేక, పంటలు పండక, చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. ఇటీవల బసలదొడ్డి గ్రామంలో ఇద్దరు, సూగూరులో ఒకరు మృతి చెందారని, వారిని పరామర్శించే వారు కూడా లేరని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఓట్లు అడుక్కునేందుకు ఇంటింటికి తిరుగుతుండగా, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో సమస్యలను విస్మరించి రైతుల పరిస్థితిని పక్కన పెట్టి రోజాకు క్రికెట్ నేర్పించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, జిల్లా తెలుగు కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, చావిడి వెంకటేష్, పెద్దకడుబూరు మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి ఎల్లారెడ్డి, గోపాల్ రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, మాలపల్లి చంద్ర, భీమన్న ఆచారి, నరసన్న ఆచారి, వగరూరు అబ్దుల్, పవన్ కుమార్ రెడ్డి, బంద్రాల నరసింహులు, కేశన్న, రోగప్ప, శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బొగ్గుల నరసన్న, ఐటిడిపి నాయకులు సల్మాన్, చిదానంద, జనసేన నాయకులు ఏసేపు పాల్గొన్నారు.

పీర్ల చావిడి (మసీదు) నిర్మాణానికి తిక్కారెడ్డి విరాళం

కౌతాళం: మండలంలోని లింగాలదిన్నె గ్రామంలో పీర్ల చావిడి (మసీదు) నిర్మాణానికి టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి రూ.50 వేల విరాళాన్ని బుధవారం గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేవాలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహాయం చేయడానికి సిద్ధంగా ఉంటానని, ఇందులో భాగంగా మసీదుకు విరాళం ఇచ్చినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి రాజు, మైనార్టీ నియోజకవర్గ అధ్యక్షులు టిప్పు సుల్తాన్, రమేష్ గౌడ్, వెంకటరెడ్డి, డాక్టర్ రాజానంద్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి కురుగోడు, శివప్ప గౌడ్ పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న తిక్కారెడ్డి

'గడపగడపకు' ద్వారా

ప్రజలను నేరుగా కలిసే అవకాశం

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

'గడపగడపకు మన ప్రభుత్వం' ద్వారా నేరుగా ప్రజలను కలిసే అవకాశం దొరికిందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక రామచంద్ర నగర్ కాలనీలోని సచివాలయం-2 పరిధిలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణి, కాచాపురం సర్పంచి వై.జయమ్మ, కుమార్తె ప్రియాంక వేర్వేరుగా 'గడపగడపకు' చేపట్టారు. వారు గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు గురించి లబ్ధిదారులతో అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు రాలేదని వై.జయమ్మ దృష్టికి తీసుకురావడంతో భూమి కొనుగోలు చేసి పంచేందుకు చూస్తున్నామని, తప్పకుండా ఇస్తామని హామీ ఇచ్చారు. సమస్యలుంటే ప్రజలు నేరుగా తమ దగ్గరకు వచ్చి చెప్పుకోవచ్చని సూచించారు. మరో వైపు హోటల్ వద్ద 'దోసే'స్తూ ప్రియాంక అందరినీ ఆకట్టుకున్నారు. కాలనీలో పలు చోట్ల సిసి రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రావడంతో త్వరలోనే చేయిస్తామని తెలిపారు. అంతకు ముందు జిపిఎస్ రెసిడెన్సీ నిర్వాహకులు అరవింద్, నాగవేణి దంపతులు ఎమ్మెల్యేకు, జయమ్మకు, ప్రియాంకకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించి స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వడ్డెర సంఘం మండల గౌరవాధ్యక్షులు వడ్డె నారాయణ తన స్వగృహంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి తేనేటి విందు ఏర్పాటు చేశారు. తన సోదరులు, తనయులతో కలిసి పూలమాలలు వేసి శాలువా కప్పి ఎమ్మెల్యేను సన్మానించారు. వైసిపి మండలాధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, పెట్రోలు బంక్ శీను, బొంబాయి శివ, సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణు గోపాల్ రాజ్, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఎంపిడిఒ మణిమంజరి, ఇఒఆర్‌డి ప్రభావతి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వేద స్వరూప, ట్రాన్స్ కో ఎఇ గోవిందు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, ఎఒ జీరా గణేష్, విద్యాధికారి మోహనుద్దీన్, ఇఒ నాగరాజు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచి హోటల్ పరమేష్, ఎంపిటిసి వెంకటేష్ శెట్టి పాల్గొన్నారు.

రూ.60 లక్షలతో సిసి రోడ్డుకు భూమి పూజ

'గడపగడపకు'లో ఇచ్చిన హామీ మేరకు రాఘవేంద్ర నగర్ కాలనీలో రూ.60 లక్షలతో సిసి రోడ్డు పనులకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి భూమి పూజ చేశారు. ఆయన కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... ఈనెల 5న వై.ప్రదీప్ రెడ్డి 'గడపగడపకు'లో ఇంటింటికీ తిరుగుతున్న సమయంలో సిసి రోడ్లు, డ్రెయినేజీ కావాలని కోరారని తెలిపారు. తప్పకుండా చేయిస్తామని హామీ ఇచ్చారని, అందులో భాగంగానే పనులకు భూమి పూజ చేసినట్లు చెప్పారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

వైభవంగా మారికాంబ దేవి దేవర ఉత్సవాలు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని బంటకుంట గ్రామంలో గ్రామ దేవత మారికాంబదేవి దేవర ఉత్సవాలు వైభవంగా సాగాయి. ప్రజలు కుంభాలతో దేవాలయానికి చేరుకొని బుధవారం పూజలు నిర్వహించారు. గ్రామంలో విద్యుద్దీపాల అలంకరణ, వివిధ వ్యాపార దుకాణాలు, ప్రతి ఇంటికీ బంధువులు, మిత్రులు రావడంతో పండగ వాతావరణం నెలకొంది. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ తమ అభిమాన నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

నాయకుల సందడి : ఉత్సవాల సందర్భంగా వివిధ పార్టీల నాయకుల సందడి నెలకొంది. వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కౌతాళం సర్పంచి పాల్ దినకరం, యువ నాయకులు సుబ్బరాజు పూజలు నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్, సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, వాల్మీకి నాయకులు, కోసిగి మండల నాయకులు ముత్తురెడ్డి, రాంరెడ్డి, మంత్రాలయం మండల నాయకులు రాఘవేంద్ర రెడ్డి, రామకృష్ణారెడ్డి, నీలకంఠ రెడ్డి, గుండప్ప గ్రామ దేవతను దర్శించుకున్నారు. టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి ఆధ్వర్యంలో చెన్న బసప్ప, అడివప్ప గౌడ్, వెంకటపతి రాజు, టిప్పు సుల్తాన్, కురుగోడు, రాజానందు, రాజబాబు పూజలు చేశారు.

'మా సమస్యలు పరిష్కరించండి'

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పని చేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరారు. బుధవారం మండలంలోని పెద్దతుంబలం 'గడపగడపకు'లో పాల్గొన్న ఎమ్మెల్యేకు సిఆర్ఎం టిఎస్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు మల్లికార్జున, హుస్సేనప్ప, బీచుపల్లి, నాగవేణి, నరసింహులు, గౌస్‌లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్స్ ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ... మీ న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీఇచ్చారు.

కౌన్సిల్‌లో సభ్యుల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

తాను మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికై మూడేళ్లు కావస్తోందని, తాను ఎన్నిసార్లు ప్రజా సమస్యలు చెప్పినా పట్టించుకోవడం లేదని, తన వార్డులో ఒక్క పని కూడా చేయలేదని టిడిపి కౌన్సిలర్ పార్వతి వెంకటేష్ తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు. ఏడు నెలలుగా కౌన్సిలర్లకు సంబంధించిన గౌరవ వేతనాలు ఇవ్వలేదని, ఇప్పటికైనా ఇవ్వాలని, ప్రజలకు మంజూరైన టిడ్కో ఇల్లు, జగనన్న ఇల్లు లబ్ధిదారులకు చూపించాలని సీనియర్ కౌన్సిలర్ బాలాజీ ప్రశ్నించారు. చెత్త బండ్లు గత రెండు నెలలుగా వీధుల్లోకి రావడం లేదని, తోపుడు బండ్లు వస్తున్నా, మరమ్మతులకు గురి కావడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని కౌన్సిలర్ రఘునాథరెడ్డి తెలిపరు. వెంకన్న బావి వద్ద ఒక వాచ్‌మేన్‌ను ఏర్పాటు చేయాలని, 'గడపగడపకు'లోనూ ఛైర్మన్‌కు విన్నవించానని, వెంకన్న బావి దగ్గర విద్యార్థులు, చిన్న పిల్లలు వెళ్లి ఆడుకుంటున్నారని, మేకలు బావిలో పడుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్ బాలాజీ కోరారు. వాచ్‌మేన్‌ను ఏర్పాటు చేస్తామని, కొత్తగా చెత్త తోపుడు బండ్లను కొంటున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తెలిపారు. బుధవారం ఛైర్మన్ బోయ శాంత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. అధికార పార్టీ కౌన్సిలర్లే అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంత్ నగర్ ప్రాంతంలో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని, కాలువలు, సిసి రోడ్లు నిర్మించాలని కోరినా ఎందుకు పట్టించుకోవడం లేదని 1వ వార్డు కౌన్సిలర్ పార్వతి వెంకటేష్ అధికారులను నిలదీశారు. తన వార్డులో ప్రజలు డెంగీ బారిన పడ్డారని తెలిపారు. వార్డులో కమిషనర్ వచ్చినా తనకు సమాచారం లేదని, కనీసం తన వార్డులో పర్యటించే సమయంలో తనకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. వార్డులో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు ప్రతిపాదన సిద్ధం చేశామని, ఇతర పనులు కూడా చేపడుతున్నామని, వార్డులో పర్యటించి కౌన్సిలర్‌కు చూపిస్తామని రాజశేఖర్ రెడ్డి వివరించారు. సినిమా థియేటర్లు, ప్రయివేట్ నర్సింగ్ హోమ్‌లు, ప్రయివేట్ విద్యాసంస్థలు, కల్యాణ మండపాలకు మున్సిపాలిటీ నుంచి అందిస్తున్న తాగునీటి కుళాయిలకు మీటర్లు ఏర్పాటు చేయాలని, వారి వద్ద నెలకు కేవలం రూ.500 తీసుకోవడం ఏమిటని, కేవలం ఒక ఇంటికి నీటిని వినియోగించుకునే వారి వద్ద రూ.150 తీసుకుంటున్నారని కౌన్సిలర్ బాలాజీ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 200 కలెక్షన్లను వెంటనే ఇవ్వాలని కోరారు. సమస్యను పరిష్కరిస్తామని ఎంఇ రాధాకృష్ణ హామీ ఇచ్చారు. కమిషనర్ రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎంఎంజి.గౌస్, నరసింహులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ పార్వతి

బకాయిలు విడుదల చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ నాయకులు దావీదు, ఎన్.నాగమణి, జె.ఎల్లప్ప, ఎస్.నరసింహులు డిమాండ్ చేశారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం ధర్నా చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ జ్యోతిర్మయికి వినతిపత్రం అందజేశారు. మల్లారి నాగరాజు, కౌలన్న, రాజు, చంద్రపాల్, శివకుమార్, ప్రసాద్, సుధాకర్, నాగరాజు, రాఘవేంద్ర, ఆంజనేయ, నాయక్, జయమ్మ, రామాంజినేయులు, భాస్కర్, చిన్న ఎల్లప్ప, నారాయణ, నాగేశ్వరావు, బాబు, రవి, సుధాకర్, పరమేష్, అయ్యస్వామి, బసవరాజు, వీరభద్ర, మూర్తి, మల్లికార్జున పాల్గొన్నారు.

ఆలూరు : ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పెండింగ్ అలవెన్స్‌లను తక్షణమే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి.కాశీం కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సి, డిఎ, పిఎఫ్, ఎపిజిఎల్ఐ సరెండర్ లీవ్ బకాయిలను ఇవ్వాలని తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపి, తహశీల్దార్ రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు అలవెన్స్ బకాయిలు రూ.18 వేల కోట్లు ఇవ్వకుండా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ప్రభుత్వం బకాయిలను చెల్లించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వెంకటేష్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బసవరాజు, రూపాలత, సురేష్‌బాబు, మంగయ్య, నాగేంద్ర, రామాంజనేయులు, రంగనాథ్, శ్రీనివాసులు, హనుమంతు, బాలేశ్వర నాయక్ పాల్గొన్నారు.

ఆలూరు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కార్మికుల జీవితాలతో జగన్ చెలగాటం : టిడిపి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మద్దతు తెలుపుతున్న టిడిపి నాయకులు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని టిడిపి నాయకులు విమర్శించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మెకు కేంద్ర మాజీ మంత్రి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి నేతలు మద్దతు ఇచ్చారు. కార్మికుల సమ్మె ఖర్చుల నిమిత్తం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మాచాని శివకుమార్ ఆర్థిక సహాయం అందజేశారు. టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న, వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ డైరెక్టర్ జి.అల్తాఫ్, రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మాచాని శివకుమార్, ఆత్మ మాజీ ఛైర్మన్ కందనాతి శ్రీనివాసులు, తెలుగు మహిళా నాయకులు గోకారమ్మ, టిడిపి ముస్లిం, మైనార్టీ నాయకులు కెఎండి.జబ్బార్, ఆఫ్గాన్ వలీ బాష, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు రోజా ఆర్ఫ్ ఉసేని, దర్జీ మోషన్న, జగతాప్ జయపాల్, సిఐటియు నాయకులు రాముడు, అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రాజు, మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు అల్వాల నాగరాజు, కె.సల్మాన్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరం

- రూ.30 లక్షలతో నేమకల్లులోని రాంపురమయ్య వీధిలో సిసి రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ముమ్మరంగా సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

మండలంలోని నేమకల్లు గ్రామంలో ప్రధాన వీధి అయిన రాంపురమయ్య వీధిలో ఎనర్జీస్ రూ.10 లక్షలు, 'గడపగడపకు' ద్వారా కేటాయించిన నిధులు రూ.20 లక్షలు ద్వారా సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు సర్పంచి ప్రేమ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి బాలన్న తెలిపారు. బుధవారం వారు సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి, మాట్లాడారు. నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చి పనులు చేయిస్తున్నామన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ సహకారంతో మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, ఎంపిపి జూటూరు హేమలత ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్ల రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ వీధి ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. అంగడి నెట్టి, రంగస్వామి, విద్యా కమిటీ మాజీ ఛైర్మన్ గోవిందరాజులు పాల్గొన్నారు.

ఆదోనిలో ఎండు మిర్చి ధర...

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం ఎండు మిర్చి గరిష్ట ధర రూ.21,500, కనిష్ట ధర రూ.4,500, మధ్య ధర రూ.10,621 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. బుధవారం మార్కెట్‌కు 995 బస్తాలు, 225 లాట్స్ వచ్చాయన్నారు. పంట ఉత్పత్తులను సరైన సమయానికి తీసుకొచ్చి సహకరించాలని కోరారు.

రూ.61.43 కోట్లతో

మున్సిపల్ అంచనా బడ్జెట్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపల్ 2024-2025 ఏడాదికి గాను రూ.61.43 కోట్లతో అంచనా బడ్జెట్‌ను మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి ప్రవేశపెట్టారు. బుధవారం జరిగిన కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో మున్సిపల్ అధికారి బడ్జెట్ అంచనాల వివరాలు, ఖర్చులు, రాబడులను వివరించారు. 2023-2024 ఏడాదిగాను మున్సిపాలిటీకి రాబడులు కలిపి రూ.2834.32 లక్షలు ప్రారంభ నిలవగా తీసుకున్నట్లు వివరించారు. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.4017.04 లక్షలు రాబడి, రూ.4978.02 లక్షలు ఖర్చుగా అంచనా వేసినట్లు తెలిపారు. మొత్తం రాబడి ప్రారంభ నిల్వ కలిపి కొత్త ఆర్థిక సంవత్సరానికిగాను రూ.6851.36 లక్షలు చూపినట్లు వివరించారు. ఈ మొత్తం నుంచి ఖర్చు రూ.4978.02 లక్షలుగా తీసివేసి, ముగింపు నిల్వ రూ.1873.34 లక్షలు చూపిస్తున్నట్లు వివరించారు. 2024-2025 సంవత్సరానికి గాను బడ్జెట్‌లో రూ.1873.34 లక్షలు ప్రారంభ నిల్వగా తీసుకున్నట్లు, 2024-2025 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.4270.65 లక్షలు రాబడి, అలాగే రూ.4997.02 లక్షలు ఖర్చుగా అంచనా వేసినట్లు చెప్పారు. మొత్తం రాబడిని ప్రారంభ నిల్వ వెరసీ రూ.6143.99 లక్షలు చూపినట్లు తెలిపారు. ఈ మొత్తం నుంచి ఖర్చు రూ.4997.02 లక్షలు తీసివేయగా, రూ.1146.97 లక్షలు ముగింపు నిల్వగా అంచనా వేసినట్లు వివరించారు.

బడ్జెట్‌ను వివరిస్తున్న అధికారులు

మహారాజశ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు
కర్నూలు అట్ ఆదోని
O.S.No. 03/2022

Between:
శ్రీమతి వెంకటలక్ష్మీ కుల్కర్ణి@ సజ్జలగుడ్డం వెంకటలక్ష్మీ మరియు సజ్జలగుడ్డం రామ్ గోపాల రావు
..... వాదులు
V/s.
సజ్జలగుడ్డం రామచంద్రరావు మరియు 16 ఇతరులు
..... ప్రతివాదులు

ప్రతివాదులైన నెం.7, 8, 9 లకు దావా సమన్లు

To.
1. సజ్జలగుడ్డం పద్మప్రియ D/o లేట్ సుమంతరావు, W/o గోపాలకృష్ణ, (Defendant No.7) R/o ఫ్లాట్ నెం.4, కృపా అపార్ట్మెంట్స్, వెస్ట్ మారేడ్పల్లి, సికింద్రాబాద్-500028,
2. సజ్జలగుడ్డం సత్య గోపాల్ S/O లేట్ సుమంతరావు, (Defendant No.8) R/o ఇంటి నెం. 42-260-64, మౌలాలి, హైదరాబాద్-500040.
3. సజ్జలగుడ్డం ఇందిరాబాయి D/O లేట్ గోపాలరావు, W/o లేట్ జె. మల్లారావు, (Defendant No.9) R/o డోర్ నెం.4-22-3ఎ, గుడ్షెఫర్డ్ స్కూల్ దగ్గర, బాలాజి నగర్, కర్నూలు-518006.

పై తెలిపిన వాదులు, ప్రతివాదులు అయిన మీపై మరియు మరో 14 మందిపైన పై కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. పై కోర్టు నుండి ప్రతివాదులు అయిన మీకు చాలా సార్లు సమన్లు పంపిననూ తీసుకోనందున కోర్టు వారి ఆదేశాల మేరకు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా పై దావా తేది: 10-01-2024 ఉదయం 10.30 గంటలకు ప్రతివాదులు అయిన మీరు కోర్టుకు హాజరు కావలెనని, మీ తరఫున ఏమైనా ఆక్షేపణలు వున్నయెడల మీరు ఖుద్దుగా గాని, మీ వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై మీ అభ్యంతరాలను తెలుపవచ్చును. ప్రతివాదులు అయిన మీరు హాజరు కాని యెడల పై కోర్టు వారు పై కేసులో వాదుల పరముగా మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

//కోర్టు వారి ఆర్డరు మేరకు//

వాయిదా తేది : 10-01-2024

శ్రీ కె. విజయభాస్కర్ రెడ్డి,
వాది తరపు వకీలు,
ఆదోని-518301.

నంది బాలోత్సవం లోగోను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఎమ్మెల్యేల ఇండ్లు ముట్టడి

- ఎమ్మెల్యేలకు వినతులు సమర్పణ - 16వ రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె
- బేతంచెర్లలో మద్దతుగా పాల్గొన్న టిడిపి నాయకులు - గడివేములలో దున్నపోతుకు వినతి ఇచ్చి నిరసన

ఆత్మకూర్ పట్టణంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్వాడీలు, నాయకులు

నంద్యాల జిల్లాలో 16వ రోజు అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు సమ్మెను ఉధృతం చేసి కదం తొక్కారు. జిల్లా వ్యాప్తంగా నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, ఆళ్లగడ్డ ప్రాంతాల్లో అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున దీక్షా శిబిరం నుండి ర్యాలీగా బయల్దేరి ఎమ్మెల్యేల ఇళ్ల వద్దకు చేరుకుని ముట్టడించారు. కొలిమిగుండ్ల, రుద్రవరం, చాగలమర్రిలో 16వ సంఖ్య రూపంలో అంగన్‌వాడీలు కూర్చుని నిరసన చేపట్టారు. బేతంచెర్లలో అంగన్‌వాడీల సమ్మెకు టిడిపి మద్దతు తెలియజేసి భారీ ఎత్తున నాయకులు పాల్గొన్నారు. గడివేములలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు దున్నపోతుకు వినతి అందజేసి నిరసన తెలిపారు.

(వార్త 6వ పేజీలో...)

నేటి నుండి 'నంది బాలోత్సవం'

- కార్యక్రమాలకు ఏర్పాట్లు సర్వం సిద్ధం - హాజరు కానున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ప్రముఖులు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల జిల్లా కేంద్రంలో నంది బాలోత్సవ ప్రథమ పిల్లల పండుగ నేటి నుండి రెండు రోజుల పాటు అట్టహసంగా ప్రారంభం కానున్నాయి. నంద్యాల మున్సిపల్ టౌన్ హలులో రెండు రోజుల పాటు జరిగే నిర్వాహణకు అన్ని ఏర్పాట్లు సర్వం సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ టౌన్ హాల్లో నంది బాలోత్సవం లోగోను నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరావతి బాలోత్సవం విజయవాడ కన్వీనర్ యూ.వి రామరాజు, నంది బాలోత్సవం గౌరవ సలహాదారు బి.శంకరయ్య, ప్రధాన కార్యదర్శి జి.నగేష్‌లు మాట్లాడారు. నంద్యాల పట్టణంలో మొదటిసారిగా నంది బాలోత్సవంలో జూనియర్స్, సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా 15, అకాడమీ 7, సాంస్కృతిక అంశాలలో 38 పోటీలు జరుగనున్నాయని తెలిపారు. ఈ పోటీలలో సుమారు 50 విద్యాసంస్థల నుండి 2500 మంది విద్యార్థులు పాల్గొననున్నారని చెప్పారు. టౌన్ హాల్‌లోని 3 సాంస్కృతిక వేదికలు, 3 అకాడమిక్ వేదికలు మొత్తం ఒకేసారి 6 వేదికలపై పోటీలు జరుగుతాయని తెలిపారు. ఇందులో పాల్గొంటున్న విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నిర్వహణ కమిటీ భోజన ఏర్పాట్లు చేస్తుందని, పాల్గొన్న ప్రతి విద్యార్థికి పార్టీసిపేషన్ సర్టిఫికెట్‌తో పాటు ప్రతి స్కూల్‌కి ఒక జ్ఞాపిక (మెమొంటో) అందిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు ముఖ్య అతిథులుగా నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నిసా, నంది గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత్రి ప్రముఖ పారిశ్రామికవేత్త ఎస్.సుజల, డిఆర్‌ఓ పుల్లయ్య, శిల్పా సహకర్ చైర్మన్ శిల్పా నాగిని రెడ్డి, రాఘవేంద్ర బ్యాంకు కోచింగ్ సెంటర్ అధినేత పి.దస్తగిరి రెడ్డి, ప్రముఖ వైద్యులు కార్డియాలజిస్ట్ డాక్టర్ క్రాంతి చైతన్య, ప్రముఖ ఈఎన్టి వైద్యులు దుర్గాప్రసాద్‌లు హాజరౌతున్నట్లు తెలిపారు. రెండవ రోజు మాజీ మంత్రి ఎన్ఎండి. ఫరూక్, ఆర్‌జిఎం విద్యాసంస్థల అధినేత మిద్దె శివరాం, జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి, ప్రముఖ ఇఎన్‌టి వైద్యులు ఎన్.శ్రీకాంత్, ప్రముఖ వైద్యులు గుర్రాల రవికృష్ణ, టి. నాగరాజు, ప్రముఖ న్యాయవాది రామచంద్ర రావు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కామర్స్ లెక్చరర్ వెంకటేశ్వర్లు, బేతంచెర్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ మరియ దాస్ పాల్గొంటారన్నారు. సమావేశంలో నంది బాలోత్సవం ఆహ్వాన సంఘం గౌరవ సలహా దారులు రామరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.మౌలాలి, కోశాధికారి ఏం.గురుస్వామి, ఆహ్వాన సంఘం సభ్యులు మాదాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా అక్రమ వెంచర్లు

- చూసీ చూడనట్లు అధికారులు - నామమాత్రపు తనిఖీలతో మమ..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

అధికార పార్టీ నేతల అండదండలతో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నిబంధనలు గాలికి వదిలేసినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన కుడా (కర్నూలు అర్బన్ డెవలప్మెంట్ ఆథారిటీ) అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నామమాత్రపు తనిఖీలతో మమ అనిపించేస్తున్నారు...

కుడాను 2017లో ఏర్పాటు చేశారు. దీని పరిధి 15,306 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. కుడా పరిధిలో వెంచర్లు వేయాలంటే తప్పనిసరిగా నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. దీనిని ఎవరూ పాటించడం లేదు. కర్నూలు శివారు ప్రాంతంలో గతంలో అధికారులు తనిఖీ చేసి వంద వరకు అక్రమ వెంచర్లు ఉన్నట్లు గుర్తించారు. నంద్యాల పరిధిలో 88, ఎమ్మిగనూరు 70, ఆదోని 10, బేతంచర్ల 21, నందికొట్కూరు 12, ఆళ్లగడ్డ 25, గూడూరు పట్టణ పరిధిలో ఎనిమిది వరకు అనుమతి లేని వెంచర్లు ఉన్నట్లు తేల్చారు. వీటి విస్తీర్ణం పది వేల ఎకరాలకు పైగా ఉన్నట్లు అంచనా. ఆయా వెంచర్లలో 20 అడుగులకు మించి రహదారులు ఉండటం లేదు బహిరంగ స్థలాలు వదలడం లేదు. వెంచర్లకు అనుమతి పొందిన తర్వాత అందులో కొన్ని ప్లాట్లను కుడాకు తనకా(మార్టిగేజ్) పెట్టాలి. నిర్వాహకులు వెంచర్‌లో వసతులు కల్పించకపోతే తనఖా పెట్టిన స్థలాలు విక్రయించి అధికారులే అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. అసలు భూమే తనఖా పెట్టడం లేదని తెలుస్తోంది. ఒక ఎకరాకు కుడా అనుమతి పొందాలంటే దాదాపు రూ. 70 వేల వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అనుమతులకే భారీగా డబ్బులు చెల్లించాల్సి ఉండటంతో అనధికారికంగా వెంచర్లు వేస్తున్నారు. రెవెన్యూ శాఖ నుంచి ల్యాండ్ కన్వర్షన్ చేయించు కుని డాక్యుమెంటు విలువపై 10 శాతం దునుము చెల్లించాలి. ఈసీ, టైటిల్ డీప్ పొందుపరిచి మాస్టర్ ప్లాన్ ప్రకారం నివాస యోగ్యమైన ప్రాంత స్థలాల పరిధికి లోబడి ఉంటేనే అనుమతులిస్తారు.

ఎకరా స్థలంలో 40 అడుగుల రహదారులు, 10 శాతం బహిరంగ స్థలం, 0.1 శాతం యుటిలిటీ, రెండు శాతం ఎమినిటీస్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన లేఅవుట్లో అన్ని అనుమతులు పొందాలంటే ఎకరా స్థలంలో 48 శాతం వరకు నిబంధనలకు అనుగుణంగా పోగా మిగిలిన 52 శాతం స్థలంలోనే ప్లాట్లు వేయాలి. వెంచర్లు వేసే వారితో అధికార పార్టీ నేతలు చేతులు కలిపి ఉమ్మడి వ్యాపారాలు చేయడమో వెనుక ఉండి నడిపించడమో చేస్తున్నారు. వచ్చే లాభాల్లో కొంతమేర ముట్టచెబుతుండటం, వెంచర్లలో వాటా కింద భూమి ఇవ్వడం వంటి ఒప్పందాలు చేసుకుంటున్నారు.

సరైన నష్టపరిహారం ఇస్తేనే భూములిస్తాం

- నష్టపరిహారం పెంచకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం
- కలెక్టరేట్ ఎదుట ఎన్‌హెచ్-167కె బాధిత రైతులు ధర్నా
- ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి అందజేత

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కల్వకుర్తి-నంద్యాల 167కె జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోతున్న భూములకు సరైన నష్టపరిహారం ఇవ్వాలని, లేనిపక్షంలో భూములు ఇచ్చేది లేదని బాధిత రైతులు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట నంద్యాల మండలం పెద్ద కొట్టాల, బిల్లాలపురం, కొత్తపల్లి గ్రామాల బాధిత రైతులు రహదారి నిర్మాణంలో కోల్పోతున్న తమ భూములకు సరైన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా పెద్ద కొట్టాల మాజీ సర్పంచి పి.జయ పాపిరెడ్డి, భాధిత రైతులు మహేష్ నాయుడు, శ్రీరాములు, గడ్డం మోహన్ కృష్ణ, కోటేశ్వరరావు, భాస్కర్ రెడ్డి, సుబ్బారెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న నష్టపరిహారం బయటి మార్కెట్ ధరలో సగం కూడా రైతులకు అందడం లేదన్నారు. అధికారుల ఏకపక్ష ధోరణి వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుర్తి-నంద్యాల 167కె జాతీయ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ రైతులకు శాపంగా మారిందన్నారు. రైతుల ప్రమేయం లేకుండా భూములను బలవంతంగా తీసుకుంటున్నారని చెప్పారు. కనీసం గ్రామ సభలు పెట్టి భాదిత రైతులతో మాట్లాడే తీరిక, ఓపిక రెవిన్యూ, జాతీయ రహదారి అధికారులకు లేదని, వారే పొలం ధర నిర్ణయించి బ్యాంకులో డబ్బులు జమ చేస్తాం, తీసుకోమని బాధిత రైతులకు నోటీసులు ఇవ్వడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం నంద్యాలకు కేవలం రెండు, మూడు కిలోమీటర్ల దూరంలోనే తమ విలువైన భూములు జాతీయ రహదారి నిర్మాణంలో పోతున్నాయని, ఎకరం పొలం బహిరంగ మార్కెట్‌లో రూ. 2 నుంచి రూ.5 కోట్ల విలువ ఉందని, ప్రభుత్వం మాత్రం మార్కెట్ విలువ ఆధారంగా ఎకరాకు రూ.3 నుంచి రూ.6 లక్షలు నష్ట పరిహారం ఇస్తున్నామని నోటీసులు ఇవ్వడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. రైతులకు ప్రభుత్వం ఇంత అన్యాయం చేస్తున్నా ఎంపీ, ఎమ్మెల్యేలు మౌనంగా ఉండడం బాధిస్తుందన్నారు. తమకు సరైన నష్ట పరిహారం చెల్లించకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని బాధిత రైతులు హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

రైతులకు సిపిఎం సంఘీభావం : కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులకు ప్రముఖ న్యాయవాది, సిపిఎం నాయకులు బి.శంకరయ్య సంఘీభావం తెలిపారు. కష్టపడి సంపాదించుకున్న భూములను ఉన్న ఫలంగా ప్రభుత్వం తక్కువ రేటుకు లాక్కోవడం దుర్మార్గమన్నారు. నంద్యాలకు అతి సమీపంలో ఉన్న పెద్ద కొట్టాల, బిల్లాలపురం కొత్తపల్లి తదితర ప్రాంతాల పొలాలకు కేవలం రూ. 3 లక్షలు ఎకరాకు ఇస్తామని అధికారులు చెప్పడం సరైంది కాదన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించి భూములు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న హైవే బాధిత రైతులు

పాములపాడు పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేస్తున్న డిఎస్‌పి

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి : డిఎస్‌పి

ప్రజాశక్తి - పాములపాడు

రానున్న ఎన్నికల దృష్ట్యా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించనునట్లు ఆత్మకూరు డిఎస్పి ఏ.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పాములపాడు పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా ఆయన స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను, స్టేషన్ గదులను, పోలీస్ స్టేషన్ ఆవరణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ నిర్వహణపై ఆయన పూర్తిగా సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పాములపాడు మండలంలో జరిగిన బంగారం దొంగతనం కేసును చేధించినట్లు తెలిపారు. మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాకు చెందిన వ్యక్తి బంగారం దొంగతనం సినీ ఫక్కీలో చేశాడని, సిబ్బంది ఎంతో సాహసించి కేసును చేధించారని తెలిపారు. పాములపాడు మండల పరిధిలో నేషనల్ హైవే నిర్మాణం ఎక్కువగా ఉన్నందున ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా అవగాహన కార్యక్రమాన్ని కల్పించ నున్నట్లు చెప్పారు. ఈ మండల పరిధిలో ఎక్కువగా కుటుంబ సంబంధ కేసులు వస్తున్నాయని, వాటిపట్ల కౌన్సిలింగ్ ఇచ్చి లోక్ అదాలత్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. స్టేషన్‌కు వచ్చిన వారి పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. మండలంలో ఎలాంటి సమస్య లేదని, ప్రశాంతంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై జి.అశోక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - పాణ్యం

ప్రముఖ శైవక్షేత్రం కొత్తూరు సుబ్బారాయుడు స్వామి వారి నిత్యాన్నదానానికి విశాఖ జిల్లాకు చెందిన సత్యనారాయణ, నాగలక్ష్మిల కుమారుడు కృష్ణ చైతన్య, లక్ష్మీ సుమిత్ర దంపతులు రూ. 2 లక్షల 42 వేలు, కర్నూలు జిల్లా తిమ్మాపురం వాసులు రామచంద్రా రెడ్డి, ప్రమీల రెడ్డి దంపతులు రూ. 10,116 విరాళంగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణ స్వామి, దాతలు పాల్గొన్నారు.

శ్రీశైలంలో రూ.215 కోట్ల పనులకు శంకుస్థాపన

- పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానంలో రూ.215.04 కోట్ల అంచనా వ్యయంతో తలపెట్టిన అభివృద్ధి పనులకు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ బుధవారం శంకుస్థాపన చేశారు. ముందుగా గంగాధర మండపం సమీపంలో సాంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించారు. అనంతరం శంకుస్థాపన చేసిన తరువాత శిలాఫలకాలను ఆవిష్కరించారు. దేవస్థానంలో నూతన క్యూ కాంప్లెక్స్, 200 గదుల యాత్రికుల సముదాయం, సాలు మండపాల నిర్మాణం, శివం రోడ్డు సుందరీకరణ, శివసేవకుల వసతి గదులు, ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్, దేవస్థానం ఉద్యోగుల నివాస సముదాయానికి కరెంటు ట్రాన్స్ఫర్ ఏర్పాటు, సబ్ స్టేషన్ నిర్మాణం, వేమారెడ్డి మల్లమ్మ మందిరం నుండి డంపింగ్ యార్డ్ వరకు కాంక్రీట్ రోడ్డు, 1000 కి.లీ వాటర్ స్టోరేజ్, 500 కి.లీ వాటర్ స్టోరేజ్ హఠకేశ్వరం వద్ద నిర్మాణం, 500 కి.లీ వాటర్ స్టోరేజ్ ఫిల్టర్ బెడ్ నిర్మాణం, దోర్నాలలో కళ్యాణ మండపం, షాపింగ్ కాంప్లెక్స్, అమ్మవారి ఆలయంలో ఉత్తర సాలు మండపాల పునఃనిర్మాణం, పంచమఠాల కంచె తదితర నిర్మాణాలకు ఉప ముఖ్యమంత్రి శంకు స్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చక్రపాణి రెడ్డి, కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు, దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస రావు, దేవాలయ శాఖ సూపరిడెంట్ ఇంజనీర్ సి.పుల్లయ్య, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రామకృష్ణ, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, వేద పండితులు, ధర్మకర్తల మండల సభ్యులు పాల్గొన్నారు.

జగన్ పాదయాత్ర కష్టంతోనే అధికారంలోకి వచ్చాం : మంత్రి

సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర కష్టంతోనే అధికారంలోకి వచ్చామని రాష్ట్ర ఉప ముఖ్యంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రూ. 1600 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. డబ్బున్న వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని అన్నారు. తాము గేట్లు తెరిస్తే టిడిపి తరపున పోటీ చేయడానికి సగం అభ్యర్థులు కూడా ఉండరని, జీవితాంతం చంద్రబాబుతో కలిసి రాజకీయం చేయాలనుకోవడం పవన్ కళ్యాణ్ ఖర్మ అన్నారు. శ్రీశైలంలో శంకు స్థాపన చేసిన పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. గత 500 సంవత్సరాల క్రితం శ్రీ కృష్ణ దేవరాయలు కట్టిన సాలు మండపాలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా నిలిచాయని, ఇపుడు కట్టబోయే సాలు మండపాలు పనులు పూర్తి నాణ్యతను కలిగి ఉండాలన్నారు. మరుగు దొడ్లు, అర్ఓ ప్లాంట్లు కూడా ఏర్పాటు చెయ్యాలన్నారు.

అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సిఎం

తృటిలో తప్పిన పెను ప్రమాదం

-బ్రేక్ ఫెయిలై గుట్టను ఢీకొన్న విద్యార్థి బస్సు
- ఆరుగురు విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి - ప్యాపిలి : ప్యాపిలి నుంచి గుడిపాడుకు వెళ్తున్న విద్యార్థుల ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. బస్సు బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో డ్రైవర్ పవన్ చాకచక్యంగా పక్కనున్న గుట్టను ఢీకొట్టించాడు. బస్సులో సుమారు 25 మంది విద్యార్థులు ఉన్నారు. ఆరుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వినయ్, దివాకర్, నరసింహ, సృజన, వీరేష్, భాను ప్రకాష్‌లను ప్యాపిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

గుట్టను ఢీకొన్న బస్సు

అభివృద్ధిని కళ్లుండి చూడలేని టిడిపి నాయకులు

- బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని కళ్లుండి చూడలేని స్థితిలో టిడిపి నాయకులు ఉన్నారని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బెలుం గ్రామం నుండి బెలుం గుహల వరకు బైపాస్ రోడ్డుకు, బెలుం గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించనున్న హైవే రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం నందిపాడు గ్రామంలో రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ సెంటర్ భవనాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి సిఎం అయిన తర్వాత గ్రామాలలో ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నాడని, రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి, పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజనీర్ నాగ శ్రీనివాసులు, వైసిపి జిల్లా ప్రచార అధ్యక్షుడు పేరం సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి, పులి ప్రకాష్ రెడ్డి, బెలుం గ్రామ ఉప సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి, బాచం వెంకటసుబ్బారెడ్డి, మొలక హుస్సేని, నందిపాడు సర్పంచ్ గురివిరెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, రాఘవరెడ్డి, కామిని గోపాల్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, బివి జగన్, వ్యవసాయ అధికారి బి జ్యోతిః, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్ తదితరులు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలో జిల్లా నేతలు

కాకినాడలోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం జరిగిన రాష్ట్ర మహాసభలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. మహాసభలో భాగంగా చర్చల్లో పాల్గొన్న నాయకులు

సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె : సిఐటియు

- మోకాళ్లపై నిలబడి సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు నిరసన

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

విద్యాశాఖ పరిధిలో పని చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె ఆగదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు, ఎస్ఎస్ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ ఎం.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నంద్యాల పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా సిఐటియు ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మెలో భాగంగా బుధవారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి శాఖలో విలీనం చేయాలన్నారు. వారి న్యాయమైన 16 రకాల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వి.బాల వెంకట్, సమగ్ర శిక్ష అభియాన్ ఎంఐఎస్ కోఆర్డినేటర్, పద్మావతి, సురేఖ, సుమలత, రామకృష్ణ, గోపాల్, వినోద్, రఫీ, డిటిపి ఆపరేటర్స్, అకౌంటెంట్, మెసెంజర్స్ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిబలడి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

- ఎస్‌వి నైస్ కంప్యూటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రాజశేఖర్

ప్రజాశక్తి - డోన్

మాట్లాడుతున్న ఎం.రాజశేఖర్

యువత ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డోన్ ఎస్వి నైస్ కంప్యూటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రాజశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎస్వి నైస్ కంప్యూటర్స్ కేంద్రంలో టెలికాం సెక్టార్ ఏపీఎస్ఎస్ డిసి, శ్రీ టెక్నాలజీస్ వారి ఆధ్వర్యంలో యువతీ యువకులకు ఎంఎస్ ఆఫీస్, టెలికాం కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలలోపు వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. కనీస విద్యార్హత పదవ తరగతి ఆపై పాసై ఉండాలన్నారు. ఎస్ఎస్‌సి మెమో ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, ఫొటో, క్యాస్ట్ సర్టిఫికెట్ రెండు జిరాక్స్ సెట్లతో జనవరి 3వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు ఎస్‌వి నైస్ కంప్యూటర్ కేంద్రంలో అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం డోన్ పట్టణం శ్రీ రామ టాకీస్ ఎదురుగా ఎస్ఎం బేకరీ పక్క లైన్‌లో కార్తికేయ గానుగ ఆయిల్ మెడ పైన ఎస్వి నైస్ కంప్యూటర్ కేంద్రంలో గానీ, సెల్ 8099558746 నెంబర్ సంప్రదించాలని కోరారు.

ఇరుగ్రూపులపై కేసు నమోదు

ప్రజాశక్తి - పాములపాడు : పాములపాడు మండలం వానాల గ్రామంలో క్రిస్టమస్ వేడుకల్లో గొడవకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు పాములపాడు ఎస్సై జి అశోక్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూత క్రిస్టమస్ పండగ పట్టి విషయంలో ఘర్షణ జరిగినట్లు తెలిపారు. ఈ ఘర్షణలో వంక ప్రభాకర్ ఫిర్యాదు మేరకు 9 మందిపై, మరో గ్రూపు వంక వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు మరో 9 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జనసేన-టిడిపి విజయం తథ్యం : ఇరిగెల

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన-టిడిపిలు కలిసి అధికారంలోకి రావడం ఖాయమని జనసేన పార్టీ తాలూకా నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి, ఇరిగెల సూర్యనారాయణ రెడ్డిలు అన్నారు. బుధవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో చాగలమర్రి మండలం రాంపల్లె గ్రామానికి చెందిన మేకల రామకృష్ణ ఆధ్వర్యంలో 12 కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. మోహన్ రెడ్డి, పవన్ కుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, మహమ్మద్ రఫీ, సాయి, అమర్నాథ్ రెడ్డి, బాబు, ఫక్రుద్దీన్, భార్గవ్ రెడ్డి, మాబు వలి తదితరులు జనసేనలో చేరారు. వీరికి ఇరిగెల సోదరులు పార్టీ కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇరిగెల రాంపుల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైపిపి రాక్షస పాలన సాగుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైకాపాకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పెసరాయి చాంద్ భాష, మిద్దె రాంపుల్లయ్య, పెద్ద బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో చేరుతున్న దృశ్యం

ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల

ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, రావలసిన ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పివి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం నంద్యాల తహాశీల్దార్ కార్యాలయం వద్ద అరు గంటల ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించాలని, సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించా లన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా పెండింగులో ఉన్న దాదాపు రూ. 18 వేల కోట్లు పిఆర్‌సి, డిఎ, బకాయిలను, ఆర్జిత సెలవుల బకాయిలను, జెడ్‌పిపిఎఫ్ లోన్స్, ఏపీజిఎల్ఐసి ఋణాలు వెంటనే ఇవ్వాలన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం చేస్తున్న కాలయపనకు నిరసనగా జనవరి 3న జిల్లా స్థాయిలో 12 గంటల నిరసన, 9, 10న 36 గంటల నిరసన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు వివి.రాంమోహన్, జిల్లా కార్యదర్శి ఎస్.షమీమ్ బాను, అరవింద్, ఎన్.బాల స్వామి, ఎం.వెంకటేశ్వర్లు, రామ్ నాయిక్, శేఖర్, ప్రేమ కాంత్ బాబు, వై వెంకట రమణ, పివి రామ కృష్ణ రెడ్డి, బిపి వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **డోన్ :** పట్టణంలోని తహాశీల్దార్ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ డోన్ డివిజన్ ఆధ్వర్యంలో మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ అధ్యక్షతన నిరసన దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.వెంకటసుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి బివై.సుబ్బా రాయుడు, ప్యాపిలి మండల అధ్యక్షుడు క్రిష్ణనాయక్, క్రిష్ణగిరి మండలాధ్యక్షులు రామ్మూర్తి, సీనియర్ నాయకులు లక్ష్మయ్య, కేశవరెడ్డి, షంషాద్ బేగం, మనోహర్, సుమన్, మురళికృష్ణ రెడ్డి, సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్, సంజీవరాయుడు, రాముడు, చంద్రమోహన్, రమేష్ నాయుడు, క్రిష్ణ కుమార్, అనూరాధ, లక్మేశ్వరమ్మ, భానుబీ, రోహిణి, తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ జిల్లా సహా అధ్యక్షులు సత్య ప్రకాష్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ ప్రతాప్, ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తహసిల్దార్ కిషోర్ కుమార్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. జిల్లా ఆడిట్ కన్వీనర్ యు దస్తగిరి, మండల సహా అధ్యక్షులు చల్లా కృష్ణయ్య, ఆర్థిక కార్యదర్శి ఎం విజయ్ కుమార్, జిల్లా కౌన్సిలర్లు కే యం నాగరాజు, వై మనోహర, వీర కుమార్ రెడ్డి ,సుధాకర్, కే గోపాల్, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఐజయ్య, ఆళ్లగడ్డ మండల ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రావు, అధ్యక్షుడు రహీమ్, ఆర్థిక కార్యదర్శి కె. వెంకటేశ్వర్లు, ఎం.వెంకటేశ్వర్లు, కేసివి రామన్, ప్రసన్న కుమార్ రాజు, శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నంద్యాల : ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

డోన్ : వినతి అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఆళ్లగడ్డ : వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

వేల్పుల ఆనంద్ కుమార్‌ను సన్మానిస్తున్న సంఘ పెద్దలు

అవకాశం వస్తే ప్రజా సేవ చేసుకుంటా

- కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్ కుమార్

- భానుముక్కల సిఎస్ఐ చర్చి నిర్మాణానికి రూ. 50 వేలు విరాళం

ప్రజాశక్తి - పాములపాడు

నందికొట్కూర్ నియోజకవర్గ శాసనసభ సీటుకు అవకాశం వస్తే ప్రజాసేవ చేసుకుంటానని కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్ కుమార్ అన్నారు. బుధవారం పాములపాడు మండలం భానుముక్కల గ్రామం సిఎస్ఐ చర్చి సంఘ పెద్దల ఆహ్వానం మేరకు ఆయన గ్రామానికి చేరుకొని చర్చి నిర్మాణాన్ని పరిశీలించారు. తక్షణ సహాయంగా రూ. 50 వేలు విరాళంగా సంఘ పెద్దలకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆధ్యాత్మికంగా తమకు ఇష్టమైన దైవ ప్రార్థన నిర్వహించుకునేందుకు ఆయా గ్రామాలలో దేవాలయాలు నిర్మించుకుంటారని తెలిపారు. అందరి ఆశీస్సులు ఉండి నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే సీటుకు అవకాశం వస్తే ప్రజాసేవ చేసుకుంటానని, అందుకు మీ అందరి ఆశీస్సులు ఉండాలని కోరారు. భానుముక్కలలో తనకు బంధుత్వం, తన విద్యాభ్యాసం, తనతోపాటు చదువుకున్న స్నేహితులు కూడా ఉన్నారని చెప్పారు. అనంతరం సంఘ పెద్దలు ఆనంద్ కుమార్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య సంఘం అధ్యక్షులు గట్టు శంకర్ గౌడ్, బీసీ సంఘం జాతీయ నాయకులు బత్తుల సంజీవరాయుడు, వైసిపి నాయకులు మహానంద రెడ్డి, ప్రభాకర్ రామకోటి నాయక్, మాల మహానాడు నాయకులు అంకన్న, నాయకులు ప్రవీణ్ గౌడ్, రామ్ గౌడు కుమార్, సిఎస్ఐ సంఘ కాపరి గుండం ఎలిసెన్న, సంఘ పెద్దలు గడ్డం శేషన్న, గడ్డం జయరాజు, గడ్డం విజయుడు, గడ్డం మోహన్, గుండం భాస్కరు, చింతకుంట ధర్మరాజు, మూల ఏసన్న పాల్గొన్నారు.

రబీ పంటలకు భీమా వర్తించదు

- నంద్యాల డివిజన్ వ్యవసాయ అధికారి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

రైతులు సాగు చేస్తున్న రబీ పంటలు నష్టపోతే పంటల భీమా, నష్ట పరిహారం ప్రభుత్వం నుంచి వర్తించదని నంద్యాల డివిజన్ వ్యవసాయాధికారి డి రాజశేఖర్, కెసి కెనాల్ ఇఇ తెలిపారు. బుధవారం మండలంలోని కెసి కెనాల్ ఆయకట్టు పరిధిలోని ఈర్నపాడు, సింగవరం, బండి ఆత్మకూరు రైతులతో మాట్లాడుతూ రైతులు కెసి కెనాల్ నీటిని విద్యుత్ మోటార్ల ద్వారా వాడుకోవడం తగదన్నారు. విద్యుత్ మోటార్లు ఉంటే తొలగిస్తామని హెచ్చరించారు. రిజర్వాయర్‌లో ఉన్న నీటి నిలువలను దృష్టిలో ఉంచుకొని రబీ పంటలు సాగు చేయాలని, బోరు బావులు ఉన్న రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి స్వాతి, కెసి కెనాల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- మోకాళ్లపై నిలబడి, మున్సిపల్ కార్యాలయాల ఎదుట నిరసన

- రెండో రోజు మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా రెండో రోజు బుధవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిల్చుని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షులు కష్ణయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వి.యేసురత్నం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు పాదయాత్రలో, ఎన్నికల తర్వాత అసెంబ్లీలో మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం అమలు చేస్తామని చెప్పి నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ఏ ఒక్క కార్మికునికి ఇవ్వడం లేదని, ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ఆప్కాస్ రద్దు చేసి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 7 ప్రకారం స్కిల్డ్ , సెమిస్కిల్డ్ అర్హులైన కార్మికులకు వేతనాలు ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ. 18,500 అమలు చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులకు సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని, లేకుంటే నిరవధిక సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, పట్టణ అధ్యక్ష ,కార్యదర్శులు లక్ష్మణ్ కె. మహమ్మద్ గౌస్. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి భాస్కరాచారి యూనియన్ నాయకులు ఆదాము, రామకృష్ణ, రామాంజనేయులు, నాగేశ్వరరావు, సిద్దయ్య, కార్మికులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట 2వ రోజు కార్మికులు సమ్మెను కొనసాగించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి పకీర్ సాహెబ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డిలు మాట్లాడారు. కార్యక్రమంలో పరమేష్, నాగేశ్వర రావు, భాస్కర్, ప్రభాకర్, రాముడు, డ్రైవర్ శీను, కర్ణ తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** ఆత్మకూరు మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పిఎఫ్‌ను చెల్లించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, గొడుగురాజు, జోసెఫ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం దగ్గర 2వ రోజు నిరవదిక సమ్మె చేపట్టారు. ఈ సమ్మెకు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రామదాసు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తిమయ్య, నాగన్న, మోహన్, సురేష్, దానమయ్య, రవి, రూతమ్మ, జీవరత్నమ్మ, మణెమ్మ, సుగుణమ్మ, కుమారి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు జి. షేభారాణి, మండల ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మధుశేఖర్ డిమాండ్ చేశారు. బేతంచర్ల నగర పంచాయతీ కార్మికులు స్థానిక కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. కార్మికులు రామాంజనేయులు, రంగడు, సుధాకర్ , పద్మావతి, మహేశ్వరి, వెంకటలక్ష్మి, మద్దమ్మ, మాస్ వెంకటేష్, సుబ్బరాయుడు, మరియమ్మ, ప్రేమ్ కుమార్, శివమ్మ పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్‌అవుట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు వెంకటయ్య ,సాల్మన్, సుబ్బరాయుడు తదితరులు మాట్లాడారు.

నంద్యాలలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకే ఆడుదాం-ఆంధ్ర

ప్రజాశక్తి - రుద్రవరం

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకే ఆడుదాం-ఆంధ్ర పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని ఆర్.నాగులవరం సచివాలయం పరిధిలో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, తహాశీల్దార్ రవీంద్రప్రసాద్, పిఆర్ఏఈ వెంకట రాముడు, కార్యదర్శి ఓబులేసు, ఎంపిటిసి రామ చంద్రారెడ్డి, వైసిపి నాయకుడు బద్రి ఎర్రన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పగిడ్యాల :** క్రీడా పోటీలను ప్రతి క్రీడాకారుడు సద్వినియోగం చేసుకోవాలని జడ్పిటిసి పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అన్నారు. మండలంలోని ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులకు క్రీడా పరికరాలను వారు పంపిణీ చేశారు. సర్పంచి ఆంజనేయులు, ఎంపీడీవో వెంకట రమణ, ఈఓఆర్‌డి నాగేంద్రయ్య, గ్రామస్తులు నాగసేనారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** పట్టణంలోని సచివాలయ స్థాయి ఆడుదాం-ఆంధ్ర పోటీలు 2వ రోజు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం, ప్రభుత్వ ఆసుపత్రి కుంట క్రీడా మైదానం, పగిడ్యాల రోడ్ ఇండోర్ స్టేడియంలో ప్రారంభం అయ్యాయి. మున్సిపల్ కమిషనర్ కిషోర్ కుమార్, వైసిపి టౌన్ అధ్యక్షులు మన్సూర్, 7వ వార్డు కౌన్సిలర్ షేక్ నాయబ్, 1వ వార్డు కౌన్సిలర్ కాటేపోగు చిన్న రాజు, 6వ వార్డు వైఎస్సార్సీపీ నాయకులు దేశెట్టి శ్రీనివాసులు (ఆర్ట్ శ్రీను), తహసిల్దార్ రాజశేఖర్ బాబు ప్రారంభిం చారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా శాప్- కో ఆర్డినేటర్ శ్రీనాథ్ పెరుమాళ్ళ, అధికారులు, ఫిజికల్ డైరెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం : పోటీలను ప్రారంభిస్తున్న చైర్మన్ గంధం రాఘవరెడ్డి

పగిడ్యాల : క్రీడాకారులతో జడ్పిటిసి, ఎంపీపీ, అధికారులు

నమ్మక ద్రోహానికి మారుపేరు జగన్ : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వెలుగోడు

నమ్మక ద్రోహానికి మారుపేరు వైఎస్ జగన్ మెహన్ రెడ్డి అని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి విమర్శించారు. బుధవారం వెలుగోడులోని ద్వారకా నగర్ కాలనీలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ రాయలసీమ ప్రాజెక్టులకు ద్రోహం చేసి చరిత్రహీనుడిగా మిగిలిపోయారన్నారు. ఆస్తిలో వాటా అడిగిందన్న కోపంతో సొంత చెల్లిని ఇంటి నుంచి తరిమేశారన్నారు. కూతురుకు ఇవ్వాల్సిన వాటా ఇవ్వమని అడిగిన తల్లిని దూరం పెట్టిన నీచమైన వ్యక్తి జగన్‌రెడ్డి అంటూ తీవ్రంగా విమర్శించారు. అందరి నమ్మకాన్ని కోల్పోయిన జగన్‌రెడ్డిని 2024 ఎన్నికలలో ఇంటికి పంపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జాకీర్, మీసేవ ఇంతియాజ్, టౌన్ ప్రెసిడెంట్ ఖలీలుల్లా ఖాన్, జనసేన షాలుబాషా పాల్గొన్నారు. **బనగానపల్లె :** రైతులను వైసిపి ప్రభుత్వం నట్టేట ముంచిందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి విమర్శించారు. మండలంలోని జిల్లెల్ల, తిమ్మాపురం గ్రామాలల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను, వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ, బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబాల రామ కృష్ణారెడ్డి, టిడిపి నాయకులు జిల్లెల్ల రాజశేఖర్ రెడ్డి, కెవి సుబ్బారెడ్డి, తిమ్మాపురం నాగేశ్వరరెడ్డి, శంకర్ రెడ్డి, గాండ్ల ఉమామహేశ్వరరావు, మేకల రామాంజ నేయులు యాదవ్, పొంకం సుధాకర్ యాదవ్, రామచంద్రుడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. **సంజామల :** వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని ఆదరించి ఓటు వేయాలని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని ఆకుమల్ల గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలుగోడు : కరపత్రాలను పంపిణీ చేస్తున్న శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

బనగానపల్లె : భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి

ఎమ్మెల్యేల ఇండ్లు ముట్టడి

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల కలెక్టరేట్ : గత 16 రోజులుగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మొండి వైఖరికి నిరసనగా నంద్యాల ఎమ్మార్వో ఆఫీస్ దగ్గర సమ్మె శిబిరం నుండి ర్యాలీగా ఎమ్మెల్యే శిల్పా ఇంటి వరకు వెళ్లి ముట్టడించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల, నంద్యాల ప్రాజెక్టు కమిటీ కార్యదర్శి సునీత మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు మలు చేయాలని అడిగితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని, వేతనాలు పెంచబోమని రాష్ట్ర మంత్రులు మొండిగా చెప్పడం తదన్నారు. నాడు-నేడు అని గొప్పగా చెప్పుకునే ముఖ్యమంత్రి నాడు అంగన్వాడీల సెంటర్ తాళాలు ఎవరూ పగలగొట్టలేదని, నేడు వైసిపి ప్రభుత్వం తాళాలు పగలగొట్టి దౌర్జన్యానికి దిగుతుందని, మహిళా సాధికారత అంటే ఇదేనా అని ప్రశ్నించారు. చీరలు, సెల్‌ఫోన్లు ఇచ్చి అది అంగన్వాడీల సొంతానికి ఇచ్చినట్టు ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ సమాచారం కోసమే సెల్ ఫోన్లు ఇచ్చారని చెప్పారు. నాణ్యమైన సరుకులు ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌లుగా మార్చాలని నాలుగున్నర సంవత్సరాలుగా ఈ ప్రభుత్వానికి చెప్తున్నా చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. నేడు అంగన్వాడీలపై వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని, దీనికి తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు డి.నిర్మలమ్మ, నాగరాణి, సావిత్రి, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** ఆత్మకూరు, వెలుగోడు, బండి ఆత్మకూరు మండలాల అంగన్వాడీలు ఆత్మకూరు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం దగ్గర 16వ రోజు సమ్మె చేపట్టారు. అనంతరం అంగన్‌వాడీలు ర్యాలీగా ఎమ్మెల్యే శిల్పా కార్యాలయం దగ్గరకు వెళ్లి ముట్టడించారు. వైసిపి శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పా కార్తీక్ రెడ్డికి, జడ్పిటిసి శంకర రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, నాయకులు రత్నమయ్య, రామదాసు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మీదేవి, తులసమ్మ, వెంకట రవణమ్మలు మాట్లాడారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించేంతవరకు వెనక్కు తగ్గేది లేదని, రోజుకో రూపంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడి యూనియన్ నాయకురాలు ప్రమీలమ్మ, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, రవణమ్మ, చెన్నమ్మ, అంగన్వాడీలు, ప్రజా సంఘాల నాయకులు సురేంద్ర, నరసింహ నాయక్, సుధాకర్, గణపతి, వీరన్న తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు 16 సంఖ్యలో అంగన్‌వాడీలు కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా నాయకులు దావీదు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పద్మావతి, లీలావతి, భాగ్యలక్ష్మి, వసుంధర, రామలక్ష్మి, ప్రభావతి, అనిత, రేణుక, శ్రీదేవి, సరిత, అంగన్వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. **రుద్రవరం :** తాసిల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు ,ఆయాలు 16 సంఖ్య రూపంలో కూర్చొని నిరసన తెలిపారు. అంగన్‌వాడీలు సరస్వతి, రాణి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరికి నిరసనగా సిఐటియు ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ తాసిల్దార్ కార్యాలయం దగ్గర సమ్మె శిబిరం నుండి అంగన్వాడీలు ర్యాలీగా ఎమ్మెల్యే ఇంటి వరకు చేరుకుని ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బాల వెంకట్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు, సిఐటియు పట్టణ కార్యదర్శి రమేష్ బాబు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు నాగమణి, మనోజ, ఉదయలక్ష్మి, రాజేశ్వరిలు మాట్లాడారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యలు పరిష్కరించేలా చూస్మాని హామీనిచ్చారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు పద్మ, రాజ్యలక్ష్మి, వసంత, వై పద్మ, అరుణ, లక్ష్మీ సౌజన్య, భారతి, శాంత, అంగన్వాడీలు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం నుండి అంగన్‌వాడీలు ర్యాలీగా పాత బస్టాండ్, పటేల్ సెంటర్, కాలేజీ రోడ్డు మీదుగా ఎమ్మెల్యే ఆర్థర్ ఇంటి వరకు వెళ్లి ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడి నాయకురాలు మదార్ బీ అధ్యక్షత వహించారు. వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరావు, సిఐటియు జిల్లా నాయకులు కె.భాస్కర్ రెడ్డి మాట్లాడారు. సిఐటియు పట్టణ కార్యదర్శి టి.గోపాలకృష్ణ, నాగన్న, మద్దిలేటి, రాము, శివుడు, వ్యకాసం జిల్లా నాయకులు పి పకీర్ సాహెబ్, ఎం కర్ణ, రైతు సంఘం నాయకులు బేస్తరాజు, అంగన్వాడి నాయకురాళ్లు వెంకట రమణమ్మ, పద్మావతి, వెంకటలక్ష్మి, ఉమాదేవి, పగిడ్యాల, జూపాడుబంగ్లా, మిడుతూరు నందికొట్కూరు మండలాల అంగన్వాడీ కార్మికులు పాల్గొన్నారు. వీరికి సంఘీభావంగా మున్సిపాలిటీ కార్మికులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరైంది కాదని, మహిళా కార్మికులను విస్మరించిన గత ప్రభుత్వాలకు ఎటువంటి పరిస్థితి ఎదురయిందో ముఖ్యమంత్రి జగన్ గుర్తుంచుకోవాలని బేతంచెర్ల మాజీ జడ్పిటిసి బుగ్గన ప్రసన్న లక్ష్మి, టిడిపి మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రవీంద్ర నాయక్, పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరిలు అన్నారు. పట్టణం భారత బేకరీ సర్కిల్‌లె అంగన్‌వాడీలు నిరసన కార్యక్రమం చేపట్టారు. అంగన్వాడీలకు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంఘీభావం తెలిపి పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర క్రిస్టియన్ కార్యదర్శి మేకల నాగరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి రూబెన్, క్లస్టర్ కన్వీనర్ బుగ్గనపల్లి రమేష్, నల్లారెడ్డి, రమేష్ రెడ్డి, గూటం శివ, కెవి సుబ్బారెడ్డి, రామవరం శివ, తిరుమలేష్ చౌదరి, అంగన్వాడీలు అనూష, అరుణ, శోభారాణి, మధురవాణి, మాణిక్య వీణ, లక్ష్మీదేవి, సుమతి, రాజేశ్వరి, రామ తులసి, విజయమని, దయామని, శివలక్ష్మి, రాధమ్మ, రాధాదేవి తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** అంబేద్కర్ సర్కిల్ వద్ద సిఐటియు, నాయకులు నాగమణి పద్మావతి వసంత వై పద్మావతి సంజమ్మ, ఏఐటీయూసీ నాయకులు చంద్రకళ వహీదా ఇందుమతిల ఆధ్వర్యంలోఅంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు 16వ సంఖ్య రూపంలో నడిరోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు నసీమ రెహనా వహీదా, హసీనా, సుజాత, ఇందుమతి, హసానమ్మ, రహమత్, జ్యోతి, గుర్రమ్మ మేరీ, ఉమాదేవి, నాగమ్మ, వెంకటసుబ్బమ్మ, గౌరీ ఈశ్వరమ్మ, పద్మావతి, గుత్తి సుజాత, మాబుచాన్, సుమతి, రహిమూన్, సహాయకులు పాల్గొన్నారు. **గడివేముల :** గడివేముల మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు వినూత్న రీతిలో వినతి పత్రాన్ని దున్నపోతుకు అందజేసి నిరసన తెలిపారు. అంగన్వాడి యూనియన్ మండల నాయకులు, అధ్యక్ష కార్యదర్శులు వసంతమ్మ, రామచెన్నమ్మ, రాములమ్మ, అంగన్వాడి కార్యకర్తలు పుష్ప, లలితమ్మ, లక్ష్మీదేవి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలలో ఎమ్మెల్యేకు వినతి ఇస్తున్న నాయకులు, అంగన్‌వాడీలు

ఆళ్లగడ్డ : అగన్‌వాడీలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల

నందికొట్కూరు : ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించిన అంగన్‌వాడీలు

బేతంచెర్లలో అంగన్‌వాడీలకు మద్దతుగా పాల్గొన్న టిడిపి నాయకులు

గడివేముల : దున్నపోతుకు వినతి ఇస్తూ అంగన్‌వాడీల నిరసన